ప్రజాశక్తి

సోమవారం 22 ఏప్రిల్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

గూండాగిరిలో ఒకేతాను గుడ్డలు

- అప్పట్లో అధికారులపై బొండా, కేశినేని దౌర్జన్యం
- నివ్వెరబోయిన నగరం
- ఇప్పుడు సిఎంపై దాడి ఘటనలో పరస్పరం ఆరోపణలు

కథనం మధ్య పేజీలో

కేశినేని, బొండా దౌర్జన్యంతో చేతులు కట్టుకు నిలుచున్న డిటిసి మీరా ప్రసాద్ (ఫైల్)

దాహార్తి తీరేనా?

- ఇంకా పూర్తిగా నిండని చెరువులు
- తూటు, గుర్రపు డెక్కతో ముందుకు పారని నీరు
- బ్యారేజీ నుంచి మరికొద్దిరోజులే నీరు విడుదల

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వల ద్వారా తాగునీటి కోసం చెరువులకు విడుదల చేస్తున్న నీటిని మరో నాలుగు రోజుల్లో నిలిపివేయనున్నారు. ఈలోపు పూర్తి స్థాయిలో అన్ని చెరువులను నింపడానికి కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం అష్టకష్టాలు పడుతోంది. తూడు, గుర్రపుడెక్క, పూడిక కారణంగా కాల్వల్లో నీటి ప్రవాహం ముందుకు సాగడంలేదు. దీంతో 11 రోజులుగా నీటిని విడుదల చేస్తున్నా జిల్లాలోని నాలుగో వంతు చెరువులను మాత్రమే అధికారులు పూర్తి స్థాయిలో నింపగలిగారు. అసలు నీరు చేరని చెరువుల సంఖ్య అధికంగానే ఉంది. ఈనేపథ్యంలో పూర్తి స్థాయిలో చెరువులను నీటితో ఎలా నింపాలో తెలియక అధికార యంత్రాంగం ఆందోళన చెందుతోంది

జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరానికి ఈనెల 8 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 2.61 టిఎంసిల నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలఉ నీటిని విడుదల చేశారు. ఈ నీటిని జిల్లా అధికారులు ప్రణాళిక బద్ధంగా చెరువులకు సరఫరా చేస్తున్నారు. వేసవిలో అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లాలో 266 చెరువులు నింపాల్సి ఉంది. 11 రోజుల్లో 51 చెరువులు మాత్రమే పూర్తిగా నిండాయి. 147 చెరువులకు పాక్షికంగా నీరు చేరింది. 68 చెరువులకు అసలు నీరు చేరలేదు. మచిలీపట్నం, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను, కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక, పామర్రు, కంకిపాడు, పెనమలూరు, గుడ్లవల్లేరు తదితర ప్రాంతాల్లోని చెరువులకు కొన్నింటిలో పూర్తి స్థాయిలో, మరికొన్నింటిలో పాక్షికంగా నీరు చేరింది. గుడివాడ, నందివాడ, బాపులపాడు, ఉంగుటూరు తదితర మండలాల్లోని చెరువులకు ఇప్పటి వరకు అసలు నీరు చేరలేదు. పూర్తి స్థాయిలో చెరువులు నింపితేనే వర్షాకాలం వచ్చే వరకు జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉంటుంది.

మరమ్మతుల్లో నిర్లక్ష్యంతో సమస్య

కృష్ణాజిల్లాలో కెఇబి, బందరు, రైవస్, ఏలూరు

(మిగతా 2లో)

చెరువుకు చేరిన కొద్దిపాటి నీరు

కొలికపూడిపై టిడిపి శ్రేణులు గుర్రు

టిడిపి సీనియర్ నేత రామారావును బయటకు పంపడంపై ఆగ్రహం

ప్రజాశక్తి - తిరువూరు, గంపలగూడెం : టిడిపి తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి కొలికపూడి తరచూ వివాదాస్పదంగా మారుతున్నారు. దీంతో ఆయనపై స్వపక్షీయులే గుర్రుగా ఉన్నారు. ఆయనను అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుండీ ఏదో ఒక సమస్యను సృష్టించుకుంటున్నారు. వచ్చిన కొద్ది రోజుల్లోనే ఒంటెద్దు పోకడలతో కొలకపూడి వ్యవహారం సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది. నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన ఆయన మొట్టమొదటగా ప్రతిపక్షాలపై చేసిన విమర్శలతో ఇరుకునపడ్డారు. అంతేగాక వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలు తొలగిస్తామంటూ చేసిన ప్రకటన అందరిలోనూ తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆ తర్వాత క్రమేణా స్వపక్ష నేతలపై కూడా ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి సీనియర్ నాయకుడు, న్యాయవాది, ఎఎంసి మాజీ చైర్మన్, పూర్వపు తిరువూరు మేజరు పంచాయతీ సర్పంచ్ తాళ్లూరి రామారావును ఘోరంగా అవమానించినట్లు తెలిసింది. శనివారం పార్టీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను కొలికపూడి తన నివాసంలో ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన రామారావును అందరిముందు ఘోరంగా అవమానించి, వ్యక గతంగా కించపరిచే విధంగా మాట్లాడి పార్టీ క్యాడర్‌ను ఖంగుతినిపించారని తెలిసింది. "మీసేవలు పార్టీకి అవసరం లేదు" అంటూ ఆయనను ఏకపక్షంగా బయటకు పంపారని రామారావు పార్టీ కార్యకర్తల వద్ద అవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి తిరువూరు నియోజకవర్గంలో మూల స్తంభాలుగా ఉన్న వారిలో రామారావు ఒకరని, అయన ఎంతో మందిని పార్టీలోకి తీసుకొచ్చి నాయకులుగా తీర్చిదిద్దారని, పార్టీకి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రామారావును ఈవిధంగా అవమానించడం సరికాదని కార్యక ర్తలు మండిపడు తున్నట్లు తెలిసింది. రామారావును ఆయన నివాసంలో పార్టీ కార్యకర్తలు కలిసి సంఘీభావం తెలిపారు. ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు తనను అవమానించడం బాధగా ఉందని రామారావు ఆవేదన చెందినట్లు తెలిసింది. నాలుగు దఫాలుగా తిరువూరులో ఓడిపోతున్నామని, ఈసారి కొలికపూడిని గెలిపించుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న తనను కొలికపూడి బయటకు పంపడం పట్ల విస్మయానికి గురయ్యానని రామారావు కార్యకర్తల ముందు వాపోయినట్లు తెలిసింది. జరిగిన విషయాన్ని ఎంపి అభ్యర్థి కేశినేని చిన్ని దష్టికి తీసుకెళ్లానని, ఆయన స్పందన ఆధారంగా ఏం చేయాలో ఆలోచిస్తానని రామారావు చెప్పినట్లు తెలిసింది. ఇటీవల కొలికపూడి వద్దంటూ కొందరు నాయకులు, కార్యకర్తలు ఎంపి అభ్యర్థి కేశినేని చిన్ని వద్దకు, పార్టీ అధినేత చంద్రబాబు వద్దకు

(మిగతా 2లో)

ప్రశాంతంగా యుపిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడలో ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 1,872 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా అయిదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాల, బిషప్ అజరయ్య జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ సెషన్లలో జరిగిన పరీక్షలను ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించారు. ఎన్‌డిఎ,

(మిగతా 2లో)

పరీక్షా కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

చెక్‌పోస్టుల వద్ద నిరంతరం నిఘా

కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ

ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరిగిందని.. మద్యం, డబ్బు, విలువైన వస్తువులు తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టంగా నిరంతర నిఘా కొనసాగుతోందని కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. చెక్‌పోస్టుల కార్యకలాపాల పర్యవేక్షణలో భాగంగా కలెక్టర్ డిల్లీరావు.. ఆదివారం ప్రకాశం బ్యారేజ్ వద్ద పోలీస్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద కార్యకలాపాలను పరిశీలించి.. పటిష్ట నిఘాకు అనుసరిస్తున్న వ్యూహాలపై సమీక్షించారు. చెక్‌పోస్టుల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. వేసవి నేపథ్యంలో చెక్‌పోస్టు అధికారులు, సిబ్బందికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ గరికపాడు, జొన్నలగడ్డ, ముత్యాల, గంప్రాయి, గంగినేని పాలెం తదితర అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులతో పాటు అంతరజిల్లా, జిల్లా లోపల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఉన్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, లోపాలు ఏవైనా ఉంటే వెంటనే చక్కదిద్దుతున్నామని వెల్లడించారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై దృష్టిసారిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పోలీస్, ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను కూడా మోహరించినట్లు వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బందాలు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)ను కూడా పకడ్బందీగా అమలు జరుపుతున్నామని చెప్పారు. ఇప్పటివరకు రూ.3.25 కోట్ల నగదు, రూ.30.67 లక్షల విలువైన 5,999 లీటర్ల మద్యం, రూ.7.35 లక్షల విలువైన 1,38,658 గ్రాముల మత్తు పదార్థాలు, రూ.2.32 కోట్ల విలువైన దాదాపు ఎనిమిది కిలోల విలువైన లోహాలు తదితరాలతో మొత్తం రూ.6.53 కోట్ల విలువైన సీజర్లు జరిగినట్లు కలెక్టర్ డిల్లీరావు వివరించారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ డిల్లీరావు

634 సి-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ-విజిల్ ద్వారా 634 ఫిర్యాదులురాగా, అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా మొత్తం 1,635 ఫిర్యాదులు రాగా 1,609 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 288 ఫిర్యాదులు రాగా 288 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందని తెలిపారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 499 ఫిర్యాదులు రాగా 491 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నంబరు (9154970454) ద్వారా 38 ఫిర్యాదులు రాగా 34 ఫిర్యాదులు, కాల్ సెంటర్ (0866-2570051) ద్వారా 24 ఫిర్యాదులు రాగా 24 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ద్వారా 66 ఫిర్యాదులు రాగా 58 ఫిర్యాదులను, సీఈవో మెయిల్స్ ద్వారా 14 ఫిర్యాదులు రాగా 11 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో మీడియా మానిటరింగ్ ద్వారా 72 అంశాలకు సంబంధించి 69 అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. సీ-విజిల్ ద్వారా తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 67 ఫిర్యాదులు, విజయవాడ పశ్చిమ నుంచి 14, విజయవాడ సెంట్రల్ నుంచి 89, విజయవాడ తూర్పు నుంచి 101, మైలవరం నుంచి 22, నందిగామ నుంచి 180, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 157, ఇతర పోలింగ్ స్టేషన్ల పరిధి నుంచి 4 సీ-విజిల్ ఫిర్యాదులు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.

దేవినేని ఉమాతో వసంత భేటీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావుతో ఆ పార్టీ మైలవరం నియోజకవర్గ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదివారం భేటీ అయ్యారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి లోని ఆయన కార్యాలయంలో వసంత కలిశారు. 2019 ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఉమా, వసంత ప్రత్యర్థులుగా ఉన్నారు. గత ఐదేళ్లుగా వసంతపై ఉమా తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. అనూహ్యంగా వసంత వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరటంతో పాటు మైలవరం నియోజకవర్గ టికెట్ దక్కించుకున్నారు. దీంతో ఇప్పటి వరకు కినుక వహించిన దేవినేని ఉమాను వసంత కలవడం చర్చనీయాంశమైంది. సోమవారం జరిగే వసంత నామినేషన్ కార్యక్రమానికి ఉమా హాజరవుతారని తెలిసింది.

చేతులు కలిపిన దేవినేని ఉమా, వసంత కృష్ణ ప్రసాద్

23న సిపిఎం గన్నవరం అభ్యర్థి కళ్లం నామినేషన్

ప్రజాశక్తి - గన్నవరం

సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు ఈనెల 23వ తేదీన నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు గన్నవరంలోని కామ్రేడ్ చింతపల్లి పాపారావు భవనంలో సభ జరుగుతుంది. ఈ సభలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఇండియా వేదిక రాష్ట్ర నాయకులు పాల్గొంటారు.

నేటి నుండి స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు

ప్రజాశక్తి - విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఈనెల 22వ తేదీ నుండి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంబివికె బాధ్యులు యు.వి.రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ట్రైనర్ పాగోలు రాజు ప్రొజెక్టర్ ద్వారా స్మార్ట్ క్లాసెస్, అధునాతన పద్ధతుల్లో బోధన చేస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు గవర్నరుపేట రాఘవయ్య పార్క్ సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో నేరుగానీ, 0866 2578044, 9490098408 నెంబర్లలోగానీ సంప్రదించాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

బందరు కాల్వలో పెరిగిన తూటుకాడ, గుర్రపుడెక్క

దాహార్తి తీరేనా?

కాల్వలు, వాటి ఉప కాలువల ద్వారా చెరువులు నింపాల్సి ఉంది. ఈ కాల్వలకు గత కొన్నేళ్లుగా పూర్తి స్థాయిలో మరమ్మతులు జరగలేదు. తూడు, గుర్రపుడెక్క తొలగింపుల్లోనూ గతేడాది నిర్లక్ష్యం వహించారు. దీంతో కాల్వల్లో గుర్రపుడెక్క, తూడుకాడ నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో పంట బోదుల్లోకి ప్రవేశించి నీరు పొలాల్లోకి చేరుతోంది. చెరువులు నిండకుండానే తాగునీరు వృథా అవుతోంది. దీంతో చెరువులు నింపడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో నీటి సరఫరా నిలిచిపోతున్న నేపథ్యంలో మరి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

ప్రశాంతంగా యుపిఎస్‌సి పరీక్షలు

ఎన్‌పి ఎగ్జామినేషన్‌కు సంబంధించి 1,127 మంది అభ్యర్థులకుగాను సెషన్-1కు 751మంది (66.64 శాతం), సెషన్-2కు 725 మంది (64.33 శాతం) హాజరయ్యారు. సిడిఎస్‌కు సంబంధించి 745 మంది అభ్యర్థులకుగాను సెషన్-1కు 263 మంది (35.30 శాతం), సెషన్-2కు 264 మంది (35.44శాతం) హాజరయ్యారు. పరీక్షలను సజావుగా నిర్వహించడంలో భాగస్వాములైన అధికారులందరికీ కలెక్టర్ డిల్లీరావు అభినందనలు తెలిపారు.

కొలికపూడిపై టిడిపి శ్రేణులు గుర్రు

వెళ్ళి ఆందోళనకు దిగారు. ఇందుకు తెరవెనుక పాత్రధారులు ఉన్నారని అనుమానించి వారిలో సీనియర్ నేత తాళ్లూరి రామారావును కొలికపూడి లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిసింది. ఇదేవిధంగా గతంలో పార్టీ సీనియర్ నేత జయసింహను కూడా "మీ సేవలు మాకు అవసరయలేదు" అంటూ ముఖం మీదే కొలికపూడి చెప్పడం కూడా చర్చనీయాంశమైంది. ఇప్పటికే సగం కేడర్ కొలికపూడి ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారని, ఇప్పుడు మిగిలిన వారు కూడా గుడ్ బై చెప్పే పరిస్థితి కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

నామినేషన్‌కు దూరంగా ఉంటాం

తాళ్లూరి రామారావును అవమానించిన కొలికపూడి సోమవారం జరిగే నామినేషన్ దాఖలు కార్యక్రమానికి తాము దూరంగా ఉంటామని రామారావు అనుయాయులు తెలిపారు. తమ నాయకుడిని అవమానిస్తే తమను కూడా అవమానించినట్లేనని చెప్పారు.

NAME CHANGE

I SWAPNA POTHABATHULA. D/o P. JAGANNADHARAO (late) R/o D.No: flat No: 76-16-30/6, Reddy Colony. Kamakoti Nagar Vijayawada, NTR district, India-520012. After marriage have Changed my name from SWAPNA POTHABATHULA TO YASARAPU TULASI SWAPNA W/o Y.TRINADH vide affidavit dated 18-04-2024 on before Notary.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గుడివాడ : న్యూ మందపాడు కాలనీ, రిక్షా కాలనీకి చెందిన వంద మంది వైసిపి కార్యకర్తలు వెనిగండ్ల రాము సమక్షంలో టిడిపిలో చేరారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో బిల్లపాడు, రిక్షా కాలనీ, మందపాడు న్యూకాలనీకి చెందిన వైసిపి నాయకులు, మహిళలు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళితో కలిసి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కర్రే వెంకటగిరి, వేముల శివ, వేములపల్లి భవాని, మీసాల సూరిబాబు, కనపర్తి నాగమల్లేశ్వరరావు, తోటగిరి సాయి, కొమ్ము చంద్రశేఖర్ పాల్గొన్నారు. **గన్నవరం:** కేసరపల్లి గ్రామంలోని చెంచుల కాలనీకి చెందిన వైసీపీ నాయకులు పలువురు ఆదివారం టీడీపీలో చేరారు. గన్నవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'కళ్లం' నామినేషన్‌కు తరలిరావాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఇండియా వేదిక బలపరిచిన గన్నవరం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు మంగళవారం గన్నవరం తరలిరావాలని సిపిఎం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షునిగా, సిఐటియు జిల్లా అధ్యక్షునిగా ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్ సందర్భంగా బహిరంగ సభ, ప్రదర్శన నిర్వహించినున్నట్లు తెలిపారు.

మోటూరులో ముగిసిన ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ రూరల్

గుడివాడ మండలంలోని మోటూరులో వేంచేసి యున్న శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ఆదివారం ముగిసాయి. ఈ నెల 15న సాయంత్రం ధ్వజారోహణతో ప్రారంభమైన కళ్యాణ వేడుకలు ఆదివారం రాత్రి స్వామి వారి పవళింపు సేవతో ముగిసాయి. కళ్యాణ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కార్యనిర్వహణాధికారిణి గొరిపర్తి నాగ మౌనిఖ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆత్మహత్యాయత్నాన్ని నిలువరించిన ఎస్ఐ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ఆత్మహత్యకు పాల్పడడానికి ప్రయత్నించిన విద్యార్థిని గుడ్లవల్లేరు ఎస్సై ఘంటా సత్యనారాయణ నిలువరించారు. మండలంలోని లంకదొడ్డి గ్రామానికి చెందిన చిన్నం టెండుల్‌కుమార్ మచిలీపట్నం నోబుల్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటానని తండ్రి ఈశ్వరరావుకు విద్యార్థి తెలియజేసి వెళ్లిపోయారు. తండ్రి గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్లో కుమారుడు మిస్ అయినట్లు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ విద్యార్థి ఫోన్ నెంబర్ ఆధారంగా పుల్లేరు వంతెన సమీపంలో రైల్వే ట్రాక్ మీద ఉన్నట్లు గుర్తించి హుటాహుటిన వెళ్లి విద్యార్థిని పట్టుకొని తండ్రికి అప్పగించారు.

మేడే ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-గుడివాడ : కార్మికుల సాధన కోసం ఏర్పడిన ఏఐటియుసి కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటియుసి జిల్లా కన్వీనర్ టి.తాతయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని ఏఐటియుసి కార్యాలయంలో శేషుబాబు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తాతయ్య మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రపంచ కార్మికులు హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించుకోవడం వల్లే కొన్ని హక్కులను సాధించుకోవడం జరిగిందన్నారు. మేడే రోజున కార్మికుల హక్కుల కోసం మళ్ళి పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ గౌవర అధ్యక్షులు గూడపాటి ప్రకాష్‌బాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, కార్మిక సంఘాల నాయకులు రామకష్ణ, వెంకన్న, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐటియుసి జిల్లా కన్వీనర్ తాతయ్య

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎన్నికల సంఘం మీడియా ప్రతినిధులకు కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో సూచించారు. సాధారణ ఎన్నికలు 2024 సందర్భంగా ఎన్నికలలో పోలింగ్ కౌంటింగ్, ప్రక్రియలు మీడియా కవరేజ్ నిమిత్తం రాష్ట్ర ఎన్నికల సంఘం మీడియా ప్రతినిధులకు అథారిటీ లెటర్స్ జారీ చేసిందన్నారు. పోలింగ్, కౌంటింగ్ తేదీలకు ముందుగా జిల్లాలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు వాటిని అందజేయడం జరుగుతుందన్నారు.ఎన్నికల సంఘం జారి చేసిన అథారిటీ లెటర్స్ పొందిన పాత్రికేయులు ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకొనదలచిన వారు 12డి ఫారాలు కలెక్టరేట్లో ని ఎన్నికల మీడియా సెంటర్ నందు జారీ చేస్తున్నట్లు తెలిపారు. 12డి ఫారాలు పూర్తిచేసి, మీడియా అక్రిడేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోటో ఓటర్ గుర్తింపు కార్డు నకళ్ళు జత చేసి డిఐపిఆర్ఓ కార్యాలయంలో ఈనెల 22వ తేదీ సాయంత్రంలోగా అందజేయవలసిందిగా తెలియజేశారు.పాత్రికేయులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

'రాజ్యాంగం నేటి కర్తవ్యం'పై సదస్సు

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'రాజ్యాంగం నేటి కర్తవ్యం'పై సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి యూనియన్ నాయకులు జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగం అందరూ సమానంగా జీవించాలని చెప్పిందన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని కొన్ని రాజకీయ పార్టీలు వారి స్వార్థం కోసం కులాలు మతాలుగా విడగొట్టి రాజ్యాంగాన్నే మార్చాలని చూస్తున్నాయని విమర్శించారు. సదస్సుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా సిఐటియు నాయకులు ధన శ్రీ, మాజేటి శివ శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్ గౌస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగిశెట్టి చంద్రశేఖర్, నాగిశెట్టి కృష్ణ, బొడ్డు నాగరాజు, మహిళా సంఘం నాయకులు మాజేటి పద్మ, లంకదాసుల సుజాత తదితరులు పాల్గొన్నారు.

24న షర్మిల పెడన రాక

ప్రజాశక్తి-పెడన: ఈ నెల 24వ తేదీ బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల పెడనకు రానున్నారని శాసన సభ అభ్యర్థి సొంటి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పాలనను ప్రజలకు వివరించేందుకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. సిపిఎం, సిపిఐ బలపరిచిన శాసనసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి తాను సోమవారం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు ఉదయాన్నే ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ఉన్న పార్టీ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలోని మంగళాపురం గ్రామ వైసీపీ సీనియర్ నాయకులు నల్లమోతు వీరయ్య, వార్డు మెంబర్ మట్టా వెంకటేశ్వరరావు, వైసీపీ యూత్ నాయకులు బొర్రా రాజ్‌కుమార్ తదితరులు జనసేన పార్టీలో చేరారు. ఆదివారం మాజీ ఉపసభాపతి, అవనిగడ్డ నియోజకవర్గ ఎన్డీయే కూటమి అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా లీగల్ కన్వీనర్ బాసు నాంచారయ్య నాయుడు, జనసేన పార్టీ కోడూరు మండల అధ్యక్షులు మర్రె గంగయ్య పాల్గొన్నారు. **అవనిగడ్డ:** వైసిపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. చల్లపల్లి మండలం మంగళపురం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు నల్లమోతు వీరయ్య, మట్ట వెంకటేశ్వరరావు, బుర్ర రాజకుమార్‌లకు పార్టీ కండుపాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మద్దాల నాంచారయ్య జ్ఞాపకార్థం వారి తండ్రి మద్దాల వెంకటేశ్వరరావు సహకారంతో హై5యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కవుతరం చిన్న దళితవాడ దగ్గరలో మచిలీపట్నం వెళ్లే ప్రధాన రహదారి లో అంబేద్కర్ విగ్రహం వద్ద మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. తెలంగాణ సిఎస్సి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజనీకుమారి, హై 5యూత్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ తదితరులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి నారాయణస్వామి, ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రీహీత వంగెవరపు రమేష్, యువతేజం ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ షేక్ కరీముల్లా, హై5యూత్ ఫౌండేషన్ సెక్రటరీ కళివరపు రంగారావు, వ్యవస్థాపకులు డాక్టర్ నాగబాబు పాల్గొన్నారు.

యాత్రికులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 20 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ల సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. యాత్రికులు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా తగు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

నేడు బుద్ధప్రసాద్ నామినేషన్

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ జనసేన పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ సోమవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కూటమిని చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

నాని ప్రచారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: జగన్‌ను ఓడించాలని కూటమి, జనాన్ని గెలిపించాలని జగన్ పోరాడుతున్నాడని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. వైసిపి గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి నాని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని గాదెపూడి, రెడ్డిపాలెం, ఉలవలపూడి, వడ్లమన్నాడు గ్రామాల్లో గడపగడప ప్రచారం నిర్వహించారు. ఆయనకు ప్రజానీకం గజమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తును నిర్దేశించేందుకు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, వైసిపి మండల అధ్యక్షుడు సాయియన రవి, పాలేటి చంటి, శేషం గోపి, పెన్నేరు ప్రభాకరరావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పడమట సుజాత, యువజన విభాగ అధ్యక్షులు గుదే రవి పాల్గొన్నారు.

సంక్షేమానికి ఓట్లు వేయండి : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం: వైసిపి గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీ ఆదివారం మండలంలోని శివారు రాజీవ్ కాలనీ, దావాజీగూడెం, అల్లాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై తిరుగుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అనగాని రవి, అల్లాపురం సర్పంచి వెంకన్నబాబు పాల్గొన్నారు.

అంబటి బ్రాహ్మణయ్య వర్ధంతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: బందరు మాజీ పార్లమెంట్ సభ్యులు, అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు అంబటి బ్రాహ్మణయ్య వర్ధంతిని టిడిపి, జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ బ్రాహ్మణయ్య చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఉపాధ్యక్షులు మట్టి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ టిడిపి మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గుడివాడ శివరావు, బచ్చు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి మండలం నాచగుంట గ్రామంలో ఉన్న భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్ పర్సన్ ఉప్పాల హారిక పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
సోమవారం
22 ఏప్రిల్ 2024

గూడూరులో శంఖారావం

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలం పీజీ లంక, కలపటం, కంకటవా గ్రామాలలో శంఖారావం కార్యక్రమాన్ని కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి కాగిత శిరీష ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కాగిత కృష్ణప్రసాద్‌ను, పార్లమెంట్ అభ్యర్థి బాలసౌరికి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోతన స్వామి, గోపి నాగబాబు, సిరివెళ్ల శ్రీను, ఎన్ఎ బేగ్, సాయన సోమయ్య, బొర్రా శ్రీను, వాకా శ్రీనివాసరావు, కాట్రగడ్డ సత్యనారాయణ, సమ్మెట రాఘవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కవి గళం

ఓటు అస్తిత్వానికి ప్రతీక

ఓటు మన అస్తిత్వానికి ప్రతీక
ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి ఓటుదే
మనచేతిలో ఉండే అస్త్రం
గురిచూసి వేస్తే పాశుపతాస్త్రం
తప్పితే అనర్థం
అంతా వ్యర్థం
ఓటు విలువ పెరగాలి
జాతి గౌరవం పెంచాలి
రాజకీయమే వ్యాపారం
రంగులు మార్చే రాక్షసీయం
జనస్వామ్యంపై ధనస్వామ్యం
గెల్చినంతకాలం,
ప్రతిరోజూ
ప్రజాస్వామ్యపతనం
ఆకర్షణా ప్రలోభాలకు దూరంగా
ఆలోచనా వివేకంతో ఓటు వేయాలి
ఎవరొచ్చినా చేసేదేముందనుకోవద్దు
దేశశ్రేయస్సు కోసం శ్రద్ధతో ఓటేద్దాం
శాంతిని కాపాడుదాం
నైతిక బాధ్యత నెరిగి ఓటేద్దాం
ఉత్సాహంగా...ఉత్తేజంగా
ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం
ప్రజాసేవే లక్ష్యమైన
ప్రభుత్వాన్ని ఎన్నుకుందాం

- సామినేని శైలజ

గూండాగిరిలో ఒకేతాను గుడ్డలు


రవాణా శాఖ అధికారులపై బొండా, బుద్ధా, పట్టాభి దౌర్జన్యం

ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు రక్షణగా ఉన్న కానిస్టేబుల్‌ను నెట్టివేస్తున్న టిడిపి నేతలు (పాతచిత్రం)

- అప్పట్లో అధికారులపై బోండా, కేశినేని దౌర్జన్యం
- నివ్వెరబోయిన నగరం
- ఇప్పుడు సిఎంపై దాడి ఘటనలో పరస్పరం ఆరోపణలు

ప్రజాశక్తి - డెస్క్

ప్రస్తుత రాజకీయాలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డిపై జరిగిన దాడి చుట్టూ తిరుగుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "మేమంతా సిద్ధం" బస్సు యాత్ర ఈనెల 13న విజయవాడ వచ్చింది. బస్సు యాత్ర సాగుతుండగా రాత్రి 8 గంటల సమయంలో సిఎం జగన్‌పై అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటరు సమీపంలోని స్కూల్ వద్ద రాయి దాడి జరిగింది. ఈ దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఎ1 నిందితుడిగా సతీష్‌కుమార్ ఉన్నట్లు పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. రాయి దాడిని పలువురు రాజకీయ పార్టీల నేతలు ఖండించారు. మరికొందరు తరతమ స్థాయిల్లో స్పందించారు. అయితే ఈ ఘటనపై ఒకపక్క దర్యాప్తు జరుగుతుండగా, మరోపక్క టిడిపి, వైసిపి నేతలు తీవ్రస్థాయిలో పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. రాయి దాడిలో మాజీ ఎంఎల్ఎ, టిడిపి విజయవాడ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా ప్రమేయం ఉందంటూ స్థానికంగా వైసిపి నేతలు కేశినేని శ్రీనివాస్ (నాని), వైసిపి అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ ఆరోపణలు చేస్తున్నారు. దీంతో బొండా ఉమా.... తన ప్రత్యర్థి పార్టీ నేతలైన కేశినేని నాని, వెలంపల్లిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ వారే ఈ దాడికి ప్రణాళిక రచించి సానుభూతి రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. అంతేగాక పోలీసు అధికారులనే లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగుతున్నారు. "నన్ను ఈ కేసులో ఇరికించాలని కొందరు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు... జూన్ 4 తర్వాత వచ్చేది మా ప్రభుత్వమే...ఆ పోలీసు అధికారులకు శంకరగిరి మాన్యాలు పట్టిస్తాం" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలా ఈ దాడి ఘటనపై టిడిపి, వైసిపి నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అయితే గతంలో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తుచేసుకుంటే...ఇదే టిడిపి, వైసిపి నేతలు గూండాగిరిలో 'ఒకేతాను గుడ్డలు' అన్న విషయం స్పష్టమవుతుందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో ఒకే పార్టీలో ఉన్న బొండా ఉమా, కేశినేని నాని కలిసి ఓ రవాణా శాఖాధికారిపై జరిపిన దౌర్జన్యాన్ని గుర్తుచేసుకుంటున్న ప్రజలు...'వారు ఏ పార్టీలో ఉన్నా వీరి గూండాగురి ఇలానే ఉంటుంది' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో రవాణా శాఖాధికారిపై వీరు జరిపిన దౌర్జన్యాన్ని ఒకసారి పరిశీలిస్తే....

టిడిపి అధికారంలో ఉండగా 2017 మార్చి 25న ఆ పార్టీకి చెందిన విజయవాడ ఎంపి కేశినేని నాని, సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమా, ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న తదితరులు విజయవాడలోని రవాణాశాఖ కార్యాలయంలో వీరంగం సృష్టించారు. సరిగ్గా ఏడేళ్ల క్రితం బందరు రోడ్‌లో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి మందీమార్బలంతో వెళ్లి అధికారులపై వేసిన వీరంగం అప్పట్లో నగరవాసులను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అధికారులు నివ్వెరబోయారు. తన వారికి చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు విషయంలో తాను చెప్పినట్లు ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వినకపోవడం ఎంపి కేశినేనికి ఆగ్రహం తెప్పించింది. దీంతో తన పరివారంగా ఉన్న ఎంఎల్ఎ బొండా ఉమా, బుద్ధా వెంకన్న, పట్టాభి తదితరులతో కలిసి వెళ్లిన నాని... ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో రాద్ధాంతం సృష్టించారు. కార్యాలయంలో అన్ని లావాదేవీలు గంటలకొద్దీ నిలిచిపోయేలా అధికారులపై వీరంగం వేశారు. తాము చెప్పినట్లు వినకపోతే ఇక్కడ నుండి బదిలీపై వెళ్లిపోవాలని, ఇక్కడే ఉండాలనుకుంటే తాము చెప్పినట్లు వినాల్సిందేనంటూ దౌర్జన్యానికి దిగారు. టిడిపి నేతల తీరుతో అప్పటి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, తోటి అధికారులు నిచ్చేష్టులయ్యారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్న ఐపిఎస్ అధికారి సుబ్రమణ్యంను నడిరోడ్డుపై నిలబెట్టి "నువ్వు ఈ పోస్టుకు పనికిరావు" అంటూ దుర్భాషలాడారు. ఉన్నతస్థాయి అధికారి అనే కనీస గౌరవం కూడా లేకుండా మాట్లాడిన తీరు అందరూ ముక్కున వేలేసుకునేలా చేసింది. ఈఘటనలో తానొక ప్రజాప్రతినిధినన్న విషయాన్ని కూడా మరిచిపోయి సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమా వ్యవహరించిన తీరు రౌడీయిజాన్ని తలపించింది. కమిషనర్‌కు రక్షణగా ఉన్న కానిస్టేబుల్‌ను బొండా నెట్టేశారు. ఆ కానిస్టేబుల్‌ను కొట్టినంత పనిచేశారు. దీంతో ఉమా అసలు ప్రజాప్రతినిధా లేక రౌడీనా అన్న వ్యాఖ్యలు అప్పట్లో ప్రజల నుండి వినిపించాయి. ఐపిఎస్ అధికారి సుబ్రహ్మణ్యంను దూషించడం, డిటిసి స్థాయి అధికారి చేతులు కట్టుకుని నిస్సహాయంగా నిలబడాల్సి రావడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈదౌర్జన్యకాండ మీడియా సాక్షిగానే సాగింది. దీంతో రాజధాని ప్రాంత నగరంలో పనిచేసే అధికారులు ఎంతగా భయపడ్డారంటే.... తమ విధి నిర్వహణలో కేశినేని నాని, బొండా ఉమా, బుద్ధా వెంకన్న వంటి నేతలు తమకు ఎదురుపడకుండా ఉంటేచాలనే పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యర్థి పార్టీల్లో కేశినేని, బొండా

- వైసిపి ఎంపి అభ్యర్థిగా నాని
- టిడిపి సెంట్రల్ అభ్యర్థిగా ఉమా

అప్పుడు ఒకే పార్టీలో ఉన్న కేశినేని నాని, బొండా ఉమా ఇప్పుడు వేర్వేరు పార్టీల్లో ఉన్నారు. ఎన్నికల ముందు ఎంపి కేశినేని టిడిపిని వీడారు. ఆ తర్వాత వైసిపిలో చేరారు. ఆయనకు వైసిపి అధిష్టానం విజయవాడ ఎంపి అభ్యర్థిగా మరోసారి అవకాశం కల్పించింది. అలాగే టిడిపి విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా బొండా ఉమా రంగంలో ఉన్నారు. వేర్వేరు పార్టీల్లో ఉన్న వీరు ఇప్పుడు సిఎం జగన్‌పై జరిగిన రాయి దాడిపై పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. వ్యక్తిగత దూషణలతో ప్రజాప్రతినిధుల స్థాయిని దిగజార్చుకుంటున్నారు. వీరి వ్యాఖ్యలతో నగరంలో వివాదాలు, ఉద్రిక్తతలు నెలకొనే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కూటమితోనే ప్రగతి సాధ్యం : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ పులిగడ్డ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి టిడిపి జనసేన బిజెపి కూటమి విజయంతోనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యం అంటూ ప్రచారం నిర్వహించారు. బందరు జనసేన పార్లమెంట్ అభ్యర్థిగా బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, కర్ర సుధాకర్, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గుంటూరు వినయ్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు చెన్ను బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్‌ను గెలిపించి ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలుగు భాషా ఉద్యమ సమైక్య అధ్యక్షులు సామల లక్ష్మణబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బుద్ధప్రసాద్‌ను లక్ష్మణ బాబు కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో తెలుగు భాష ఉద్యమ సమైక్యను ప్రారంభించడం జరిగిందని, 20 ఏళ్లుగా మండలి బుద్ధ ప్రసాద్‌తో కలసి తెలుగు భాష కోసం పోరాటం చేస్తున్నామన్నారు. తెలుగు భాషలోనే పరిపాలన జరగాలని మాతృభాషలోనే బోధన జరగాలని తమ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో శివరామకృష్ణ, ఎర్రంశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

నాగాయలంకలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-అవనిగడ్డ

వైసిపి బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు నాగయలంక మండలం ఎదురుమొండి దీవులలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఈలచెట్లదెబ్బ, నాచుగుంట గ్రామాల ప్రజలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నాగాయలంక అధ్యక్షులు బోగాది వెంకట శేషగిరిరావు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను ఓడించండి

ఆరుగొలనులో సిపిఎం నేతల విస్తృత పర్యటన

ప్రజాశక్తి-గుడివాడ : మతోన్మాద బిజెపిని దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను ఓడించాలని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బాపులపాడు మండలం ఆరుగొలను, ఒగిరాల గ్రామాల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు విస్తృతంగా పర్యటించారు. తొలుత ఆరుగొలను సెంటర్లో ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఓటర్లను కలిసి తన విజయానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి వంగపండు రామకృష్ణ, మండలకార్యదర్శి బేత శ్రీనివాసరావు, నాయకులు అబ్దుల్ బారి, తోట సాంబశివరావు, బలుసుపాటి శ్రీనివాసరావు, చింత వీరరాఘవయ్య, జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ఆర్‌సిపి రెడ్డి, రాష్ట్ర నాయకులు కొల్లాటి శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, కృష్ణాజిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు మర్రాపు పోలినాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు సమరం, సమీర్, మహిళా సంఘం నాయకులు రజిని, వీరమ్మ, ప్రజానాట్యమండలి నాయకులు ప్రభుదాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుగొలను, గన్నవరంలలో ఎన్నికల ప్రచారం

రాజీవ్‌కాలనీలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ రాజీవ్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండా వీరాస్వామి మాట్లాడుతూ దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి, టిడిపిల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జగన్ పోకడ వల్ల ఇసుక ధరలు అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికుల బతుకులు దెబ్బతిన్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న మోడీని, ఆయనకు మద్దతు పలుకుతున్న వైసీపీ, టిడిపిలను ఓడించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి జయమ్మ, నక్క వెంకటేశ్వరరావు, మీరాఖాన్, తిరువీధి సుబ్బారావు, మోటమర్రి నాగ బ్రహ్మాచారి, షేక్ బాజీ, మహమ్మద్ కరీముల్లా, నక్క శివ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల హయాంలోనే విజయవాడ అభివృద్ధి

సిపిఎం 'సెంట్రల్' అభ్యర్థి సిహెచ్.బాబూరావు

బాబూరావుకు మద్దతు తెలుపుతున్న ఆటో కార్మికులు

ప్రచార హోరు

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్

విజయవాడ నగరంలో అభివృద్ధి జరిగింది అంటే అది కమ్యూనిస్టుల హయాంలోనేనని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం సింగ్‌నగర్‌లోని రాజీవ్‌నగర్, హుడా కాలనీలో ఇండియా ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ అభివద్ధి చెందాలంటే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలన్నారు. సింగ్‌నగర్ దగ్గర నుండి రాజీవ్ నగర్ కండ్రిక వరకు కమ్యూనిస్టులు కార్పొరేటర్లుగా ఉన్న సమయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఘనత కమ్యూనిస్టులదేనని చెప్పారు. నేడు నగరంలో పేదలు నివశించడానికి ఇళ్లు లేవని, అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఇవేమీ పాలకులకు పట్టడంలేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న టిడిపి, వైసిపి, జనసేన పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. బిజెపితో కలిసి చంద్రబాబునాయుడు, జగన్ తమ పరిపాలనలో విజయవాడను ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యాసర సరుకులు పెరగడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో సామాన్యులకు అందుబాటులో ఉండే కమ్యూనిస్టులు, వామపక్షాలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణరావు, కే దుర్గారావు, నాయకులు కె.శ్రీదేవి, చింతల శీను, ఎస్‌కె పీరు, నాగేశ్వరరావు, రాంబాబు, సాంబిరెడ్డి, అమ్ములు, ఝాన్సీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనమకూరులో దళిత గర్జన సభ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని పెనమకూరు గ్రామంలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో దళిత గర్జన సభ నిర్వహించడం జరిగింది. టిడిపి మండల అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్, పామర్రు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా, టిడిపి జనసేన బిజెపి కూటమి బలపరిచిన మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికల పరిశీలకుల పర్యటన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో ఎన్నికల నిర్వహణ తీరు పరిశీలించేందుకు, ఎన్నికలు సజావుగా జరిగేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 11-మచిలీపట్నం పార్లమెంటు నియోజక వర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా రుషబ్ గుప్తా, ఐఆర్ఎస్ ఎన్నికల సంఘం నియమించిందని, వీరు ఈనెల 18వ తేదీన జిల్లాకు చేరుకుని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు మచిలీపట్నం అసెంబ్లీ, పెడన, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా శ్రీ జాన్ కింగ్స్ లే ఏ.ఆర్. ఐఎఎస్ గారిని ఎన్నికల సంఘం నియమించింది అన్నారు. వీరు ఈనెల 24వ తేదీన జిల్లాకు చేరుకుంటారని తెలిపారు.గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులుగా నియించబడిన శ్రీ నరహరి సింగ్ బంగర్ ఈనెల 23వ తేదీ జిల్లాకు రానున్నారని తెలిపారు. మచిలీపట్నం, పామర్రు, పెనమలూరు, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ప్రవీణ్ చౌహాన్ ఐఆర్ఎస్‌ను, గుడివాడ గన్నవరం పెడన అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా శ్రీ వికాస్, ఐసిఏఎస్ లను ఎన్నికల సంఘం నియమించిందని వీరు ఈనెల 17వ తేదీ నుండి జిల్లాలో వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు.

భళే చిత్రాలు

ఎండకు విరుగుడు...!!!

ఎండకు విరుగుడు...అవును ఇది ఎండకు విరుగుడే...! ఒకపక్క భానుడి భగభగతో జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. మరోపక్క రాజకీయ వేడి బయటకు వచ్చేలా చేస్తోంది..!! దీంతో ఎండ తీవ్రత నుండి ఎలాగైనా బయటపడాలనే ఉద్దేశంతో వినూత్న ఆలోచన చేస్తున్నారు కొందరు. ఈ నేపథ్యంలోనే ఇటు ఎండ తీవ్రతను తట్టుకునేందుకూ, అటు వినూత్న ప్రచారం చేసేందుకు కొత్త ఆలోచన చేశారు. ఏప్రిల్ 19వ తేదీన ఇండియా వేదిక బలపరచిన సిపిఐ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా రంగంలోకి దిగిన జి.కోటేశ్వరరావు నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మహిళలంతా ఇలా సిపిఐ, సిపిఎం సింబల్స్ ముద్రించిన ఎర్రని గొడుగులు వేసుకుని ముందుకు సాగడం అందరినీ ఆకర్షించింది. - డెస్క్

ఆజాద్ ముస్లిం కమిటీ అధ్యక్షునిగా మౌలాలి

ప్రజాశక్తి - చందర్లపాడు : మండలంలోని తోటరావులపాడు గ్రామానికి చెందిన షేక్ మౌలాలిని ఆజాద్ ముస్లిం కమిటీ నందిగామ నియోజకవర్గ యూత్ అధ్యక్షులుగా నియమిస్తూ ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా ఆదివారం నియామక పత్రం అందజేశారు. అనంతరం మీరా మాట్లాడుతూ నందిగామ నియోజక వర్గంలో యువతను ఆజాద్ ముస్లిం కమిటీ వైపు తీసుకు వచ్చేలా పనిచేయాలని కమిటీ చేస్తున్న సేవా కార్య క్రమాలను, పోరాటాలను వారికి వివరించి నియోజక వర్గంలో పూర్తి కమిటీని త్వరలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మొండితోక జగన్మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా వైసిపి ఎంపి అభ్యర్థి కేశినేని నానిని భారీ మెజార్టీగా గెలిపించడానికి ముస్లిం మైనార్టీలు, కమిటీ ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర నాయకులు కోఆప్షన్ సభ్యులు మీర్ హుస్సేన్ (పండు) విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఆజాద్ ముస్లిం కమిటీ యూత్ అధ్యక్షులు అన్వర్ బేగ్, నాగుల్ మీరా తదితర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో వెయ్యిమందికి పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - తిరువూరు : జన విజ్ఞానవేదిక (జెవివి) తిరువూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాగార్జున పాఠశాలలో బిపి, షుగర్, ఫిట్స్ రోగులకు నిర్వహిస్తున్న రెగ్యులర్ వైద్య శిబిరానికి ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాల నుండి వెయ్యిమంది హాజరయ్యారు. డాక్టర్లు వి.రవీంద్ర, రామకోటేశ్వరావు, సత్యతేజ, కృపారాణి, మెడికో ఆర్.ఆలేఖ్యలు రోగుల వైద్య పరీక్షల రిపోర్టులను పరిశీలించి రెండు నెలలకు సరిపడా మందులు, ఇన్సులిన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మందులు క్రమం తప్ప కుండా వాడటంతో పాటు ఆహార నియమాలు కూడా పాటిస్తేనే బి.పి,షుగర్,ఫిట్స్ లు అదుపులో ఉంటాయని తెలిపారు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. గత 11 సంవత్సరాలుగా ఇదే పాఠశాలలో జరుగు తున్న రెగ్యులర్ వైద్య శిబిరానికి వస్తున్న రోగులకు శ్రీవాహినీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ఎస్ విద్యా ర్థులు, 40 మంది జనవిజ్ఞానవేదిక వాలంటీర్లు సేవలు అందిస్తున్నారు.

కైలే ప్రచారం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలం లో యాకమూరు,గరికపర్రు గ్రామాల్లో ఆదివారం పామర్రు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల కార్యక్రమం నిర్వహిస్తూ ప్రతి గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా కలిసి వారి అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడిగా నన్ను గెలిపించాలని కోరారు.అలాగే మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సింహాద్రి చంద్రశేఖర్ ను ఫ్యాన్ గుర్తుపై వేసి పార్లమెంట్ సభ్యుడుగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి, సర్పంచి గాదే కనకదుర్గ, బొమ్మ రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదపారుపూడి : పెదపారుపూడి మండలం నాగపురం, సోమవరప్పాడు, లక్ష్మీపురం (వెంట్రప్రగడ), వింజరంపాడు గ్రామాల్లో పామర్రు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా కలిసి వారి అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడిగా తనను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సింహాద్రి చంద్రశేఖర్ ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్ పామర్రు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ జాజుల చిన్నారి, సర్పంచులు నాగదేశ సుబ్రహ్మణ్యం, శ్రీధర్ ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు సైతం లెక్కచేయకుండా

పోటాపోటీగా అభ్యర్థుల ప్రచారం

నందిగామలో తంగిరాల సౌమ్య ప్రచారం

ప్రజాశక్తి - నందిగామ : నామినేషన్ పర్వం ప్రారంభం కావడంతో నందిగామ నియోజకవర్గంలో రాజకీయ వేడి తగులుతుంది. ఒకపక్క భగభగ మండే ఎండలు మరో పక్క నాయకులు ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి తిరిగి ఓటర్లు కలిసి ఆయా పార్టీల అజెండా వివరిస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో వైసిపి, టిడిపి పోటా పోటీగా ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ముఖ్య నాయకుల గెలుపే ధ్యేయంగా శ్రమిస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు. అయితే భానుడి భగభగలకు, రాజకీయ సెగ తోడు కావడంతో ప్రచార పోరులో పాల్గొనే శ్రేణులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు క్షణం తీరిక లేకుండా విజయావకాశాల కోసం శత విధాల ప్రయత్నం చేస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో ఎన్నికల వేడి ముందు భానుడి భగభగలు అలసిపోతున్నాయి. మండే ఎండలను సైతం తిరిగి లెక్క చేయకుండా మొండితోక జగన్‌మోహన్‌రావు, తంగిరాల సౌమ్య పోటీలు పడి ముమ్మరంగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైపోయారు. పోయిన పరువు దక్కించు కోవాలని టిడిపి, మరోసారి పట్టు నిలుపుకుని, నియోజకవర్గంలో ఆధిపత్యము సాధించాలని వైసీపీ పట్టుదలతో ముందుకు సాగుతుంది. జనసేన, బిజెపి మద్దతుతో తమకు వెయ్యిఏనుగుల బలం వచ్చిందని, విజయం తమదేనంటూ టిడిపి ప్రచారం చేస్తుండగా, వైసీపీ పార్టీ తరఫున ఎన్ని కూటములు వచ్చిన, ఎంతోమంది లోపాయి కారి ఒప్పందాలతో బరిలో నిలిచిన తమ విజయాన్ని ఆపలేరంటూ అధికార పార్టీ నాయకులు ధీమాగా వున్నారు. నందిగామ ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ పూర్తిగా అండగా ఉంటూ పై ఎత్తున అన్ని చూసుకుంటున్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే నందిగామ అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని, అభివృద్ధి చూసి ఓట్లు వేయాలని కోరుతున్నారు. ఇక తంగిరాల సౌమ్య ప్రచారంలో మాజీ మంత్రి దేవినేని ఉమా అనుచరగణం దూరంగా ఉంటున్నారు. జనసేన, బిజెపిలు మద్దతు కూడా అంతంత మాత్రంగానే ఉందని విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి ప్రచారం చేస్తున్న సందర్భాలు కూడా అరుదుగా ఉన్నాయి. తెలుగు రాజ్యాధికారం పార్టీ అభ్యర్థి జై భీమ్ శ్రీనివాస్ అప్పుడప్పుడు ప్రచారం చేస్తున్నారు. మరో ఇండిపెండెంట్ అభ్యర్థులు కొత్తపల్లి సుందర రావు, బెజవాడ గోపి నామినేషన్లు వేసి ప్రచారానికి దూరంగా వుంటున్నారు.

రెడ్డిగూడెంలో సర్నాల నాగలక్ష్మి ప్రచారం

చిల్లకల్లులో 9వ రోజు ప్రచారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆదేశాల మేరకు మండలంలోని చిల్లకల్లు గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైరా రోడ్డు, బాలాజీ హాస్పటల్ లైన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రతి ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి క్యాలెండర్ అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధే టిడిపి ధ్యేయం : శ్రీరాం శ్రీదేవి

జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తన భర్త టిడిపి, జనసేన, బిజెపి కూటమి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముందుకు సాగుతున్నారని, రాజగోపాల్ సతీమణి శ్రీరాం శ్రీదేవి అమ్మాజీ స్పష్టం చేశారు. పట్టణంలోని 4వ వార్డు సీతారాంపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సీతారాంపురం బజార్‌లో ఉన్న శేషాచల వెంకటేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం టిడిపి, జనసేన, బిజెపి మహిళా నేతలు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోను సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ రాజగోపాల్, ఎంపి అభ్యర్థి నాని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

జగనన్‌కు అండగా నిలవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గంలో ముస్లిం సోదరులందరూ జగనన్నకు మరోసారి అండగా నిలవాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కోరారు. మండలంలోని చిల్లకల్లు ముస్లిం కాలనీలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొన్నారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, ఆయన పరిపాలనకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ఎంత తేడా ఉందో గమనించాలని కోరారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాల వల్లే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని అన్నారు. 24న తన నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలు తరలిరవాలని కోరారు.

జగ్గయ్యపేటలో శ్రీరాం శ్రీదేవి ప్రచారం

నందిగామలో ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు ప్రచారం

సర్నాల నాగలక్ష్మి ప్రచారం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని కుదప గ్రామంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు భార్య సర్నాల నాగలక్ష్మి ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ - 1 చాట్ల రాబర్ట్, వైస్ ఎంపీపీ - 2 పాటిబండ్ల శ్రీనివాసరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో రైతు పేట, ఏరియాలో వైసిపి శ్రేణులతో కలిసి ప్రతి గడపకు తిరుగుతూ, ఎన్నికల ప్రచారంలో వైసిపి నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి మొండితోక జగన్ మోహన్‌రావు ఆదివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు.

శ్రీరాం రాజగోపాల్ ప్రచారం

ప్రజాశక్తి - నందిగామ : కొణతమాత్మకూరు, జొన్నలగడ్డ, రామిరెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీరామ్ రాజగోపాల్ ఆయా గ్రామాల నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ సంక్షేమంతో కూడిన అభివృద్ధి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని అన్నారు. టిడిపి హయాంలోనే మౌలిక వసతుల కల్పన చేశామని అన్ని రోడ్లు సిసి రోడ్లుగా మారాయని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి విజయంతోనే అమరావతి అభివృద్ధి చెందుతుందని శ్రీరామ్ రాజగోపాల్ ప్రజలకు తెలుపుతూ టిడిపి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను తెలుపుతూ ఎన్డీఏ కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

19వ డివిజన్లో గద్దె అనురాధ ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సంక్షేమం అనే పునాదులపై నిర్మితమైన పార్టీ టిడిపి అని కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఆదివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ పరిధిలోని గద్దె అనురాధ గద్దె రామ్మోహన్ గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన, బీజేపీలు బలపరిచిన టీడీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామమోహన్ను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా ఆమె ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం చేస్తున్న దాత గిరి

ప్రజాశక్తి - విస్సన్నపేట : తెల్లదేవరపల్లి గ్రామంలో పలు కుటుంబాల్లో ఆరోగ్య పరిస్థితులు బాగోలేక ఇబ్బందులు పడుతున్న కొందరికి ఎన్ఆర్ఐ వల్లభనేని గిరి రూ.10 వేలు చొప్పున ఆరుగురికి ఆర్థికసాయం అందజేశారు. కారుమంచి సామెలు, కారుమంచి మారయ్య, కారుమంచి వెంకాయమ్మ, పల్లెపోగు పరంజ్యోతి, యడం బక్కబాబు, బొల్లిపోగు బాలరాజుకు ఈ సాయం ఆదివారం అందించారు. ఆయన వెంట తెల్లదేవరపల్లి టిడిపి గ్రామ అధ్యక్షులు వేగి రాజా ఎన్టీఆర్ జిల్ల కార్యనిర్వాహణ కార్యదర్శి రాయల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

బందరు అభివృద్ధికి కృషి : కొల్లు

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : తన చివరి రక్తపు బొట్టు వరకు బందరు అభివృద్ధి కోసం పనిచేస్తానని మాజీ మంత్రి కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక కొబ్బరి తోట చిరంజీవి ఫ్యాన్స్ యూత్ ఆదివారం టిడిపి, జనసేనలో చేరారు. వీరికి కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరి,బండి రామకష్ణ. పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొల్లు.రవీంద్ర, వల్లభనేని బాలశౌరి లు మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పినట్టు యువత కొండను సైతం పిండి చెయ్యగలరన్నారు. బందరు అభివృద్ధికి తమ సహకారం అందించడానికి ముందుకు వచ్చిన యువతకు అభినందనలు తెలిపారు. బందరులో కేవలం పేర్ని నాని కారణంగానే కోవిడ్ మరణాలు జరిగాయని, సొంత డ్రైవర్, కార్పొరేటర్ మరణానికి కారకుడయ్యాడన్నారు. పవన్ కళ్యాణ్ కుటుంబం కోసం హీనంగా మాట్లాడిన వ్యక్తి పేర్ని నాని అన్నారు. రాష్ట్ర స్థాయిలో కాపు సోదరుల ఆత్మ గౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన వ్యక్తి పేర్ని నాని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బందరులో గోల్డ్ కవరింగ్‌ను అభివృద్ధి పథంలో నడిపించామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రాగానే మచిలీపట్నాన్ని 'ఉద్యోగ ఉపాధి' అవకాశాల హబ్‌గా తీర్చిదిద్దుకుందాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, వల్లభనేని అనుదీప్, బండి విజయ్, పిప్పళ్ళ వెంకన్న, దిలీప్ కుమార్, ఛాయాదేవి పాల్గొన్నారు.

వెండి రథోత్సవం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఈ నెల 19వ తేదీ నుండి 27 తేదీ వరకు జరుగుతున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవ కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయ ఇఒ కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో ఆలయ వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి, అమ్మవార్లు వెండి రథంపై మహా మండపం నుండి వెండి రథంపై బయలుదేరి కనకదుర్గా నగర్, కుమ్మరిపాలెం సెంటర్, కామకోఠి నగర్, శంకరమఠం, సితార సెంటర్, సొరంగం, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా మహా మండపం చేరుకున్నారు.

ఆలయాధికారులతో మాట్లాడుతున్న ఇఒ

24, 25 తేదీల్లో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో 24, 25వ తేదీలలో సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచనం ఏర్పాటు చేయ నున్నట్లు దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కె.ఎస్ రామారావు తెలిపారు. ఆలయ అధికారులతో కార్యనిర్వాహణాధికారి సమావేశమయ్యారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వర్ధమాన్ వికాస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ రాజకుమారి థియేటర్ సమీపంలోని గుజరాతి పాఠశాల ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ దుర్గా శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు ఆయన కూడా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వర్ధమాన మహావీర్ జయంతిని పురస్కరించుకొని గుజరాతి పాఠశాల ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. శ్రీదేవి కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ శ్రీదేవి కంటి ఆస్పత్రి, డాక్టర్ అగర్వాల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గుజరాతీ పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తాను ఈ పాఠశాలలో చదువుకున్నానని, ఇదే పాఠశాలలో మూడోసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. తమ పాఠశాల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ రమ్యశ్రీ, ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, పోలీసులు

డిగ్రీ విద్యార్థులకు అభ్యాసిక కార్యక్రమం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ కె.వి.ఆర్ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ ఆధ్వర్యంలో 2023- 24 ప్రథమ డిగ్రీలో చేరిన విద్యార్థులకు అభ్యాసిక పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కో ఆర్డినేటర్ ఏలూరు పిచ్చే శ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ పి రాయప్ప పాల్గొన్నారు. విద్యా ర్థులను ఉద్దేశించి అంబేద్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ విద్యార్థులకు అభ్యాసక సహాయక సేవలు ఎన్ని రకాల గా ఏ విధంగా అందిస్తుందో వివరించారు .ఆన్లైన్ సేవలు, తరగతులు నిర్వహణ, పరీక్షల నిర్వహణ, సెమిస్టర్ విధానము, స్టడీ మెటీరియల్, ప్రాక్టికల్స్ విధానము, మొదలైన అనేక అంశాలు గురించి వివరించారు. కోఆర్డినేటర్ మాట్లాడుతూ విద్యార్థుల సందేహాలు, స్టడీ సెంటర్ సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కౌన్సిలర్స్, ఆఫీసు సిబ్బంది బి.శ్రీనివాస్ చౌదరి ఎం.కే కిషోర్ పాల్గొన్నారు.

అభ్యాసిక పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

192 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలోని ద్విచక్ర వాహనంపై తెలంగాణ రాష్ట్రం రామాపురం ఎక్స్ రోడ్ నుండి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న 192 మద్యం సీసాలు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.77,315లు అని, మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి శ్రీనివాసరావును అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ పోలీసులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలో ఇటుక బట్టీల కోసం, సాగుచేసే సారవంతమైన పంట పొలాలను నిస్సారంగా మార్చిడం వలన, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని ఎంతో సారవంతమైన పంట భూములను, ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకలు తయారీ కోసం ఉపయోగించటం వల్ల భూమి సారం నశించి భూమి ఏ పంటకు ఉప యోగ పడద నీ, తద్వారా భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారం, ధనార్జనే ధ్యేయంగా జరుగుతున్న ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకునే అవకాశం కూడా లేదనిపిస్తుంది. పంట

పాగతో పొంచి ఉన్న పెనుప్రమాదం

ఈ ఇటుక తయారీ కేంద్రాలు ఊరుకి సమీపంలో ఉండటం వల్ల ఇటుకల తయారు కోసం నిల్వ ఉన్న బూడిద, వరిపొట్టు, పొగ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ పొగ పీల్చిన వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి, అనుమతి లేకుండా, విచ్చల విడిగా పుట్టుకొస్తున్న ఇటుక బట్టీల వలన ప్రకతి కి విఘాతం కలిగించి, భవిష్యత్తులో విపత్తు కలిగించే విధంగా ఉన్న ఇటుక బట్టీల వారికి అధికారులు తగిన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఎంతో పచ్చగా ఉన్న పంట పొలాలు ఎడారిలా మారి ధాన్యంపు కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుట్టగొడుగుల్లా ఏర్పాటు అవుతున్న ఇటుక బట్టీ తయారిని అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై త్వరలోనే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టకపోతే పచ్చని పంట పొలాలు ఎడారిలా మారి ఆహార ధాన్యాల ఉత్పత్తి లేక కరువు ప్రాంతంగా మారే ప్రమాదం ఉంది. కనుక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలు సైతం ఇటుకల కర్మాగారాలే

పొలాలు, మామిడి తోటల మధ్య ఇలాంటి ఇటుక తయారీ బట్టీలను ఏర్పాటు చేయడం వల్ల బట్టీని కాల్చే సమయంలో వచ్చే పొగ వల్ల చుట్టుపక్కల ఉన్న పంటలు దెబ్బతింటునాయనీ, ఈ బట్టీలు ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా అతి సమీపంలో ఉండటం వల్ల కూడా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న ప్రదేశం...

బిసి సదస్సులో మాట్లాడుతున్న గురుమూర్తి

బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - కంచికచర్ల : బిసిల అభివృద్ధి, సంక్షేమం టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని రాష్ట్ర బిసి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి అన్నారు. కంచికచర్ల మండలం వేములపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో జయహో బిసి హ్యాబీటేషన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా బిసిలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుచేతి వృత్తుల వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఎన్నో రుణాలు అందజేసి బిసి కులాల ఆర్థిక పురోగతికి ఎంతగానో దోహదపడ్డారన్నారు. నేడు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీ కులాల వారినిను పట్టించుకోక పోగా వారికి నిలువ నీడ లేకుండా చేసిన ఘనత ఈ జగన్మోహన్ రెడ్డికి దక్కిందని గురుమూర్తి ఎద్దేవా చేశారు. నందిగామ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అల్లాడి కోటేశ్వరరావు మైనార్టీ జిల్లా నాయకులు ఎండి అల్లి పాషాఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మరక శ్రీనివాసరావు జిల్లా బిసి సెల్ కార్యదర్శి జనిగొర్ల నరసింహారావు గ్రామపార్టీ అధ్యక్షులు ముక్కుపాటి నరసింహారావు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాస్

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి నల్లగట్ల

ప్రజాశక్తి - తిరువూరు : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విశ్వబ్రా హ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరువురులోని శ్రీసూర్య ఏసీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకం ద్వారా చేతివృత్తి దారులైన విశ్వబ్రాహ్మణులకు ఎంత మేలు చేకూరిందని, మరలా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం రూ.పదివేలు నగదు జమచేసేలా జగన్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కుల కమ్యూనిటీ హాలు, వీరబ్రహ్మం దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు ఏర్పాటు చేపిస్తానని తెలిపారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఆర్‌కె.చారి, సంఘం ప్రతినిధులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మాచారి, తరుమణి రామకృష్ణ, ఆడేపు కోటేశ్వరరావు, గంటల కృష్ణారావు, చిన్న ముసలయ్య, తూముల కష్ణమాచారి, తూముల శేఖర్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సత్యమ్మ బోనాల మహోత్సవాలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మ వారి ఆలయంలో జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో అర్చక స్వాముల నందిగామ సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో శ్రీ సత్యమ్మ అమ్మవారికి చివరి రోజు ప్రత్యేక అలంకరణ విశేష అర్చనలు మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ఆదివారం గ్రామ బోనాలు సందర్భంగా మహిళలు పాలు పొంగళ్ళు తో అమ్మవారికి మొక్కుబళ్ళు తీర్చుకొని పూజలు చేశారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ ప్రభ బండ్లఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కొత్త కంచవ గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఉత్సాహంగా ముగిసిన చెస్ పోటీలు

విజేతలుగా డి.సాత్విక్, షణ్ముఖరెడ్డి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్: కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో రెండు రోజుల నుండి జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ఉత్సాహంగా ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 62 మంది క్రీడాకారులు పాల్గొన్నారని కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.ఎం.ఫణికుమార్ తెలిపారు. బాలుర విభాగంలో డి.సాత్విక్, భాస్కర రత్న షణ్ముఖ రెడ్డి మొదటి రెండు స్థానాలు సాధించగా బాలికల విభాగంలో జి.అమూల్య, వై.పెర్మీ రక్షిత మొదటి రెండు స్థానాలు సాధించారని తెలిపారు. వీరు త్వరలో జరుగనున్న నేషనల్ అండర్ -17 చెస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారన్నారు. వివిధ ఏజ్ గ్రూపులలో కూడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. అండర్ -7 బాలుర విభాగంలో కె.సుధీర్, నందన్ రెడ్డి, బాలికల విభాగంలో కుశల్ కార్తికేయ, శ్రీ వశిష్ట మొదటి రెండు స్థానాలు సాధించారన్నారు. అండర్ -11 బాలుర విభాగంలో వర్ధన్, సుహాస్, అండర్ -13 బాలుర విభాగంలో షణ్ముఖ సాయి, యతిన్ రెడ్డి మొదటి రెండు స్థానాలు సాధించారన్నారను. అండర్ -15 బాలుర విభాగంలో షణ్ముఖ రెడ్డి, దుర్వేశ్, మొదటి రెండు స్థానాలు సాధించారని తెలిపారు.

అండర్ -7 బాలికల విభాగంలో యశ్విత వర్మ, కావ్య , అండర్ -9 బాలికల విభాగంలో గురు వర్ధిని, సహస్ర వర్మ, అండర్ -11 బాలికల విభాగంలో పేర్మి రక్షిత, స్నేహశ్రీ, అండర్ -13 బాలికల విభాగంలో అముల్య, త్రిపురాంబిక, అండర్ -15 బాలికల విభాగంలో సాయి దివ్య, కార్తిక మొదటి రెండు స్థానాలు సాధించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆంధ్ర చెస్ అసోసియేన్ జాయింట్ సెక్రటరీ రామ సుబ్బారెడ్డి, గ్రీన్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయి అపర్ణ, ఎస్.ఆర్.ఆర్. ఛారిటబుల్ ట్రస్టు అధినేత పి.రేణుక, అధ్యక్షులు జె.సౌజన్య, గుడివాడ చెస్ మేనేజర్ సుమన్, విజయవాడ చెస్ కోచ్ సతీష్ వర్మ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

'సూపర్ సిక్స్' కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ రూరల్ : రైతులకు సాగునీరు, ప్రజలకు తారునీరు అందివ్వలేని చేతకాని ప్రభుత్వం వల్ల అందరూ కష్టాలు పడ్డారని కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గుంటాకోడూరులో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో గుడివాడలో నీటి ప్రాజెక్టులన్నీ నత్త నడకన నడుస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. అసెంబ్లీ అభ్యర్థికి సైకిల్ గుర్తుకు, పార్లమెంటు అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు పై ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని ప్రార్ధించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జి), జనసేన ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల తెదేపా అధ్యక్షుడు వాసే మురళీ, గ్రామ తెదేపా నాయకులు అంగడాల వీర్రాజు, అంగడాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ అంగడాల సురేష్, చీకటి శేషగిరిరావు, కొడాలి రామరాజు, కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ ఎనిమిదో రోడ్డులోని నల్లూరు చక్రధర్ రావు వీధిలో శ్రీ పంచ ముఖ ఆంజ నేయ స్వామి ధ్యాన మందిర విగ్రహ ప్రతిష్ట మహో త్సవం ఆది వారం వైభ వంగా జరిగింది. నల్లూరు కాశీ దంపతులు, గర్నేని చలపతిరావు, జివిబిజి.తిలక్ దంపతులు, నడకుదుటి నారాయణ దంపతులు ఆధ్వర్యంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు అందరి సహకారంతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రతి ఆదివారం దాహార్తులకు మజ్జిగ పంపిణీ సేవాకార్యక్రమాన్ని నిర్వహిస్తున్న హరివిల్లు ఫౌండేషన్ మూడో వారం కూడా ప్రజలకు మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మూడో ఆదివారం అయిన ఈ రోజు విద్యాధరపురం, సితార సెంటర్, బైపాస్ రోడ్డు కూడలి వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకూ వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న పాదచారులకు, వాహన చోదకులకు చల్లటి మజ్జిగను అందజేశారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు.కనకారావు, ఫౌండేషన్ కోశాధికారి అయిన ఎం.రవి కుమార్, ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయంలో అమ్మ వారి అలంకరణ నిమిత్తం సైనిక్ పురి, హైదరా బాద్‌కి చెందిన చింతం రాంకుమార్ 33 గ్రాములు బరువు గల బంగారు నెక్లెస్‌ను ఆదివారం ఆలయ అధికారు లను కలిసి దేవస్థానమునకు విరాళంగా అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ లేడీస్ సర్కిల్ 52, విజయవాడ రౌండ్ టేబుల్ 68, సంజీవిని స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఏపీఐఐసీ కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఏపీఐఐసీ కాలనీలోని జమాక్ హౌసింగ్ సొసైటీ భవన సముదాయంలో ఆదివారం మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో సుమారు 50 మందికి పైగా వైద్య నిపుణులు పాల్గొని శిబిరంలో పాల్గొన్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో బిపి, షుగర్, బ్లడ్ కల్చర్, ఈసీజీ ఎక్కువ కంటి దంత పరీక్షలతో పాటు వ్యాస్కులర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ రౌండ్ టేబుల్ 68 ఛైర్మన్ కిరాత్ సింగ్, మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను అందించేందుకు అవసరమైన తరగతి గదులు, మౌలిక సదుపాయాలను తమ సంస్థ ఆధ్వర్యంలో కల్పిస్తున్నట్లు చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెల వృద్ధాశ్రమాలు అనాధాశ్రమాలు పారిశుధ్య కార్మికులకు విరాళాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 500 మంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఆమె వివరించారు. అనంతరం

విజయవాడ లేడీస్ సర్కిల్ 52 ప్రాజెక్ట్ కన్వీనర్ శృతి, సంజీవని స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షురాలు డి ప్రసన్న మాట్లాడుతూ సంజీవని ట్రస్ట్‌తో కలిసి మెగా మెడికల్ క్యాంపు నిర్వహించామని తాము సంపాదించిన రూపాయిలో 25 పైసలు సమాజ సేవకు వినియోగిస్తున్నామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్ష, డాక్టర్ అమూల్య, లేడీస్ సర్కిల్ ఛైర్మన్ సునైనా, డాక్టర్ చాగంటి సుబ్బారావు డాక్టర్ చాగంటి సునీత డాక్టర్ అనిల్ కుమార్, నిర్వాహకులు శతి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో సమ్మర్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ ఆర్ ఎగ్జిబిషన్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ మాజీ కార్యదర్శి మలినేని నారాయణ ప్రసాద్, నంది అవార్డ్స్ జ్యూరీ మెంబర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి, నటుడు నందివాడ నాని లాంచనంగా ప్రారంభించారు. బందరు రోడ్డు లోని వజ్ర గ్రౌండ్స్ లో నూతనంగా ఆర్‌ఆర్‌ఆర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఆర్ ఆర్ ఆర్ సెట్టింగులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో పిల్లలకు ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో జైంట్ విల్, మేరి కొలంబస్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్, ఇండియన్ టొరాటోరా, ఇటాలియన్ ఐటమ్స్ వంటి ప్రత్యేకమైన ఆట వస్తువులు ఉన్నాయన్నారు. బెడ్ షీట్స్, బెంగాలీ కాటన్, శారీస్, లక్నో సారీస్, నైటీస్, కాస్మోటిక్, గాజులు అనేకమైన ఆటబొమ్మలు, హ్యాండ్లూమ్స్, హ్యాండ్ క్రాఫ్ట్ స్టాల్స్, అనేక రకాల ఫుడ్ స్టాల్స్ ఎగ్జిబిషన్లో అందుబాటులో

ఆర్ ఆర్ ఆర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నాని

ఉంటాయన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకులు గోపీనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరానికి తలమాణికంగా ఆర్‌ఆర్‌ఆర్ సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంతవరకు ఎన్నడూ చూడని విధంగా ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని కోటను ఎగ్జిబిషన్ ప్రధాన ద్వారాన్ని అందంగా ముస్తాబు చేసినట్లు చెప్పారు. చిత్రంలోని ప్రధాన ఘట్టాలను ఇతి వృతంగా తీసుకొని ఏర్పాటు చేసిన నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయని ఆయన తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వజ్ర గ్రౌండ్స్ అధినేత వల్లూరి రవితేజ, మాజీ ప్రిన్సిపాల్ దొంతాల ప్రకాష్, నిర్వాహకులు నందివాడ కిరణ్ అడపా ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేట విద్యార్థిని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కాకినాడలో శ్రీ జ్యోతి నృత్య కళానికేతన్ వారి ఆధ్వర్యంలో జరిగిన తెలుగు బుక్ అఫ్ రికార్డ్ 2024 కూచిపూడి నత్యంలో పట్టణంలోని నాగార్జున హై స్కూల్ విద్యార్థి టి అలకనంద అద్భుతమైన నాట్య ప్రద ర్శన చేసింది. ఆదివారం పాఠశాల యాజమా న్యం, సిబ్బంది అలకనందను అభినం దించారు.

మోహన్‌రావుకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో పట్టణానికి చెందిన చిట్యాల మోహన్‌రావు ఇటీవల కాలంలో నేపాల్‌లో జరిగిన ఎస్వీకేపీ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్ స్విమ్మింగ్ బాడీ బిల్డింగ్ యోగాలలో 8 పథకాలు బంగారు పథకాలు సాధించారు. ఈ నేపథ్యంలో చిట్యాల మోహన్‌రావును ఆదివారం ఇండోర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నరసింహారావు, రామారావు, పాండు రంగారావు, మహేష్, వజ్రాలహరి ఖాజా, పల్లంపాటి సత్యంబాబు పాల్గొన్నారు.

మహావీర్ జయంతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మహావీర్ జయంతిని పురస్కరించుకొని వన్‌టౌన్‌లో జైనులు నిర్వహించిన శోభయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. 2623వ భగవాన్ మహావీర్ జన్మకల్యాణిక్ వేడుకలను పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వివిధ జైన్ ఆలయాల్లో పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సంభవన్యాద్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్, శ్రీ సంభవన్యాద్ రాజేంద్రసూరి జైన్ శ్వేతాంర్ ట్రస్టల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వన్‌టౌన్‌లో భారీ శోభయాత్రను నిర్వహించారు. మర్వాడీగుడి వీధిలోని ఆలయం నుంచి ప్రారంభమైన ఈ శోభయాత్రలో జైనులు వందలాదిగా పాల్గొని నత్యాలు చేస్తూ మహావీర్‌ను స్మరించుకుంటూ ముందుకు సాగారు. మహిళలు, పురుషులు జైన సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు

ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక విస్సన్నపేటలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానికులకు వర్కర్స్‌కి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ చర్యల గురించి అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ బి.నానిక, అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు తీసుకో వాల్సిన జాగ్రత్తల కరపత్రాలు స్థానికులకు అందజేశారు. గ్యాస్ సిలిండర్ వాడే కస్టమర్లకు నివారణ చర్యలను ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.